

కావేరమ్మపేటలోని ఓ హోటల్‌లో సమోసాలు వేస్తున్నబీఆ ర్‌ఎస్‌జి ల్లా అధ్యక్షుడు లక్ష్మారెడ్డి

# కాంగ్రెస్‌కు గుణపాఠం చెప్పాలి

- జాతీయ పార్టీలతో పేదలకు లబ్ధి చేకూరలే..
- బీఆర్‌ఎస్‌మ హబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి లక్ష్మారెడ్డి

జడ్చర్ల టౌన్, మే 9 : బూటకపు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌కు గుణపాఠం చెప్పాలని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి లక్ష్మారెడ్డి అన్నారు. బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డికి మద్దతుగా గురువారం జడ్చర్లలోని కావేరమ్మపేటలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అన్ని వార్డుల్లో ఇంటింటికీ వెళ్లి ఓటర్లను కలుసుకున్నారు. ఈ సందర్భంగా లక్ష్మారెడ్డి ఓ హోటల్‌లో స్వయంగా సమోసాలు వేస్తూ ఓట్లు అభ్యర్థించారు. సర్కారిచ్చిన హామీలు అమలవుతున్నాయా? అని ప్రజలను అడిగారు. అచరణలో అమలు కాని హామీలిచ్చి ప్రజలను మోసం చేశారని.. కాంగ్రెస్, బీజేపీలతో పేదలకు ఎలాంటి మేలు జరుగలేదన్నారు. ఆ రెండు పార్టీల నాయకుల మాటలు నమ్మి మోసపోవద్దని.. కారు గుర్తుకు ఓటేసి బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. బీఆర్‌ఎస్ హయాంలో జరిగిన అభివృద్ధిని ప్రజలకు వివరించారు. వ్యాపారస్తులను సైతం కలిసి ఓటు అభ్యర్థించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు, కౌన్సిలర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ప్రజలతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి

# మరోసారి మోసపోయి ఆగం కావొద్దు

- తండాలఅ భివృద్ధి కేసీఆర్ ఘనతే.. : మాజీ ఎమ్మెల్యే మర్రి

బిజినేపల్లి, మే 9 : అసెంబ్లీ ఎన్నికల్లో మాదిరిగా మోసపోయి ఆగం కావొద్దని, ఈనెల 13న జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటేసి బీఆర్‌ఎస్ అభ్యర్థి ప్రవీణ్‌కుమార్‌ను అధిక మెజార్టీతో గెలిపించాలని మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని ఎర్రగుంట తండా, నక్కల చెరువుతండా, ఊడ్గులకుంట తండా, పెద్దతండా, బొడుసుగడ్డ తండా, వసురాంతండా, కారుకొండ తండా, వెల్గొండ, వట్టెంలో మర్రి ప్రచారం నిర్వహించి మాట్లాడారు. ఆర్‌ఎస్పీ గెలిపిస్తే బిజినేపల్లి మండలంలో గిరిజన పాఠశాల ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామన్నారు. గత ప్రభుత్వాలు తండాలను పట్టించుకోలేదని.. తండాలను ప్రత్యేక గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేసి అభివృద్ధి చేసిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. ఆరు గ్యారెంటీల అమలులో సర్కారు విఫలమైందన్నారు. ప్రభుత్వానికి కనువిప్పు కలగాలంటే బీఆర్‌ఎస్ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. కేంద్రంలో ఉన్న బీజేపీతో మనకు ఒరిగిందేమీ లేదని విమర్శించారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు పూర్తిచేసి లక్షా యాభైవేల ఎకరాలకు సాగునీరు అందిస్తామన్నారు. ఎన్నికల్లో అందరూ కారు గుర్తుకు ఓటేసి ఆర్‌ఎస్పీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ శ్రీనివాస్‌గౌడ్, పులేందర్‌రెడ్డి, భారతి, వంశీ, శంకర్, గోపి, భోజ్యా, లింబ్యానాయక్, తిరుపతిరెడ్డి, రాములు, నాగిరెడ్డి ఉన్నారు.





కొత్తకోటలో రోడ్‌షోకు హాజరైన బీఆర్‌ఎస్ శ్రేణులు, మాట్లాడుతున్న ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

# ప్రజల తరఫున పోరాడుతాం

- అబద్ధపు హామీలివ్వడంలో ఘనుడు రేవంత్.. : మాజీ ఎమ్మెల్యే ఆల

కొత్తకోట, మే 9 : ఆరు గ్యారెంటీలు, 420 హామీలు అమలుచేస్తామని అధికారంలోకి వచ్చి రాష్ట్రాన్ని ఆగం చేసిండ్రని మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని పాలెం, నిర్వేన్, కానాయపల్లి గ్రామాల్లో బీఆర్‌ఎస్ పాలమూరు ఎంపీ అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డికి మద్దతుగా ప్రచారం చేశారు. అనంతరం కొత్తకోట పట్టణంలో రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అబద్ధపు హామీలివ్వడంలో రేవంత్‌రెడ్డి ఘనుడని విమర్శించారు. ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని హామీ పత్రం ఇచ్చి.. బస్సుల్లో ఫ్రీ ప్రయాణం పేరిట మహిళల మధ్య గొడవలు సృష్టించాడన్నారు. పోరాడి సాధించుకున్న తెలంగాణను కేసీఆర్ అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తే.. కాంగ్రెస్ అధికారం చేపట్టి సంక్షేమాన్ని విస్మరించిందని దుయ్యబట్టారు. శంకరసముద్రం రిజర్వాయర్ నిర్వాసితులకు ఇండ్లు నిర్మించి ఇచ్చేందుకు కేసీఆర్ ప్రభుత్వం రూ.20కోట్లు మంజూరు చేసిందన్నారు. ఆరునెలలు గడుస్తున్నా రూ.రెండు లక్షల రుణమాఫీ ఎందుకు చేయడం లేదని, హామీలను నెరవేర్చే వరకు పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్‌చైర్మన్ వామన్‌గౌడ్, ఎంపీపీ గుంత మౌనిక, సీడీసీ చైర్మన్ చెన్నకేశవరెడ్డి, ప్రశాంత్, రామకృష్ణారెడ్డి, శ్రీనివాసులు, నరోత్తంరెడ్డి, శేఖర్‌గౌడ్, సత్యం, గట్టయ్య, రాములు, వెంకటేశ్వర్‌రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.



కల్వరాలలో ఉపాధిహామీ కూలీలతో మాట్లాడుతున్నమా జీ ఎమ్మెల్యే బీరం

# ప్రజలు సిద్ధమవ్వాలి

- కాంగ్రెస్ రాకతోనే కరువొచ్చింది : మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి


వీపనగండ్ల, మే 9 : అబద్ధాలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీకి ఎంపీ ఎన్నికల్లో బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధమవ్వాలని మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. గురువారం ఎన్నికల ఇన్‌చార్జి ఆంజనేయగౌడ్‌తో కలిసి కల్వరాలలో ఉపాధి కూలీలతో మాట్లాడారు. కారు గుర్తుకు ఓటేసి ఆర్‌ఎస్ ప్రవీణ్‌ను గెలిపించాలని కోరారు. పదేండ్ల బీఆర్‌ఎస్ పాలనలో రాష్ట్రం సుభిక్షంగా ఉండేదని.. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన వెంటనే కరువొచ్చిందన్నారు. అభివృద్ధిలో రాష్ట్రాన్ని దేశంలోనే నెంబర్ వన్ స్థానంలో నిలిపిన ఘతన కేసీఆర్‌కే దక్కుతుందున్నారు. ప్రతి ఒక్కరూ ఎంపీ ఎన్నికల్లో ఆలోచించి ఓటు వేయాలని సూచించారు. అబద్ధాల కాంగ్రెస్, విద్వేషాలు నింపే బీజేపీకి బుద్ధి చెప్పాలన్నారు. కొల్లాపూర్ కోటపై ఎగిరేది బీఆర్‌ఎస్ జెండానేనన్నారు. ఆర్‌ఎస్పీని గెలిపించుకొని నాగర్‌కర్నూల్ ప్రాంత అభివృద్ధిని సాధించుకుందామన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు సత్యనారాయణగౌడ్, ఎంపీటీసీ భాస్కర్‌రెడ్డి, నాయకులు రఘునాథ్‌రెడ్డి, సర్దార్ పాల్గొన్నారు.



బీఆర్‌ఎస్‌లో చేరిన కాంగ్రెస్ నేతలతో ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి

# బీఆర్‌ఎస్‌తోనే రాష్ట్రం సుభిక్షం : ఎంపీ మన్నె

నవాబ్‌పేట, మే 9 : అధికారంలోకి వచ్చిన ఐదు నెలల్లోనే కాంగ్రెస్‌పై ప్రజల్లో వ్యతిరేకత వచ్చిందని ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం మల్లారెడ్డిపల్లికి చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు గురుకుంటలోని మన్నె స్వగృహంలో కారెక్కారు. నర్సింహులు, విష్ణు, సుధాకర్, ఆంజనేయులు సహా మరికొందరు బీఆర్‌ఎస్‌లో చేరగా.. వారికి మన్నె గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో నాయకులు నర్సింహారెడ్డి, లక్ష్మయ్య, లింగం తదితరులున్నారు.



అలంపూర్ రోడ్‌షోకు భారీగా హాజరైన ప్రజలనుద్దేశించి మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్



అలంపూర్ రోడ్‌షోలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి, చిత్రంలో ఎమ్మెల్యే విజయుడు, ఎంపీ అభ్యర్థి ఆర్‌ఎస్పీ

### సమస్యలపై గళం విప్పుతా : ఆర్‌ఎస్పీ

తానూ నడిగడ్డ బిడ్డనే అని.. ఈ ప్రాంత అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని బీఆర్‌ఎస్ కందనూలు ఎంపీ అభ్యర్థి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ హామీ ఇచ్చారు. కాంగ్రెస్ నాయకుల మాటలు నమ్మి మోసపోవద్దని సూచించారు. బీఆర్‌ఎస్ పార్టీపై నమ్మకం ఉంచి తనను గెలిపిస్తే పార్లమెంట్‌లో ప్రజా సమస్యలపై గళం విప్పుతానన్నారు. వెనుకబడిన అలంపూర్ నియోజకవర్గానికి కేంద్రం నుంచి నిధులు తీసుకొచ్చి అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తానన్నారు. కారు గుర్తుకు ఓటేసి తనను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

# ఒట్లతో ఓట్లు అడుక్కుంటున్నారు..

- మరోసారి గెలిస్తే తాటిచెట్టుకు కొబ్బరికాయలుకో యమంటరు..
- కాంగ్రెస్ సర్కారునుతరి మికొట్టాలి
- ఎమ్మెల్సీ చల్లావెం కట్రామిరెడ్డి
- అధిక మెజార్టీతో గెలిపించాలి : ఎమ్మెల్యే
- కేంద్రం మెడలు వంచి నిధులు తెస్తా..
- నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థిఆ ర్‌ఎస్పీ
- అలంపూర్,రా జోళిలో రోడ్ షో..

అలంపూర్/రాజోళి, మే 9 : కాంగ్రెసోళ్లు దేవుళ్లపై ఒట్లు వేసి ఓట్లు అడుక్కుంటున్నారని, వారి మాయమాటలు నమ్మి మరోసారి ఓట్లేస్తే తాటిచెట్టును చూపి కొబ్బరికాయలు కోయమని చెబుతారని ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి ఎద్దేవా చేశారు. పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా గురువారం ఎమ్మెల్యే విజయుడు, బీఆర్‌ఎస్ నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌తో కలిసి అలంపూర్, రాజోళిలో రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా చల్లా మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ నాయకుల మాటలు విని ఒకసారి మోసపోయాం.. మరోసారి మోసం చేసేందుకు సీఎం రేవంత్‌రెడ్డి దేవుళ్ల మీద ఒట్టు వేసి ఓట్లు అడుగుతున్నాడన్నారు. హామీలను గాలికొదిలేసి మళ్లీ ఓట్ల కోసం వస్తున్న కాంగ్రెస్ నాయకులను గ్రామాల్లోకి రాకుండా బుద్ధి చెప్పాలన్నారు. ఆరు గ్యారెంటీలను అమలు చేసేందుకు చేతగాక ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారన్నారు. తెలంగాణ దశ, దిశ మార్చిన కేసీఆర్ నడిగడ్డ ప్రజల కోసం తుమ్మిళ్ల ఎత్తిపోతలను ఏర్పాటు చేస్తున్నారన్నారు. ప్రవీణ్‌కుమార్ చదువుకున్నోడు, మేధావి, ఐపీఎస్ ఉద్యోగం వదులుకొని మనకు సేవ చేసేందుకు రాజకీయాల్లోకి వచ్చారన్నారు. అటువంటి వ్యక్తిని గెలిపించుకుంటే మనకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. అలంపూర్ ప్రజలు ఏమనుకున్నా కచ్చితంగా చేస్తారని ఎమ్మెల్యే విజయుడు అన్నారు. గతంలో తనకు ఇచ్చిన మెజార్టీకి రెండింతలు ఆర్‌ఎస్పీకి అందించాలని కోరారు. అంతకు ముందు ఆర్‌ఎస్పీ పట్టణంలోని జోగుళాంబ బాల బ్రహ్మేశ్వరస్వామి ఆలయాలు, షా అలీ పహిల్వాన్ దర్గాను దర్శించుకొని బీఆర్‌ఎస్, ఎమ్మార్పీఎస్ నాయకులు బల్గెర్ హుస్సేన్ మాదిగ, ప్రేమదాసు, లక్ష్మణ్‌తో కలిసి ఇంటింటి ప్రచారం చేశారు. మీ బిడ్డగా ఆశీర్వదించి కారు గుర్తుకు ఓటేసి గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మనోరమ, వైస్ చైర్మన్, కౌన్సిలర్లు, రాజోళి మాజీ సర్పంచ్ గోపాల్, గంగిరెడ్డి, హుస్సేన్, యువనాయకులు కిరణ్‌కుమార్‌రెడ్డి, వివిధ మండలాల ప్రజాప్రతినిధులు, బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

# రుణమాఫీ ఎటుపాయె..

- కాంగ్రెస్ పాలనలో కరెంట్ కోతలు
- రేవంత్‌ను నమ్మితే నట్టేట మునుగుడే..
- బీజేపీ రాష్ట్రానికి చేసింది ఏమీ లేదు
- మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్



కోడూరులో బీఆర్‌ఎస్ నేతలు, ప్రజలనుద్దేశించి మాట్లాడుతున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

పాలమూరు, మే 9 : కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇస్తానని రుణమాఫీ ఎక్కడ పోయిందని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ప్రశ్నించారు. గురువారం మహబూబ్‌నగర్ రూరల్ మండలంలోని ధర్మాపూర్, వెంకటాపూర్, రాంచంద్రాపూర్, కోడూరు, జమిస్తాపూర్‌లో బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి శ్రీనివాస్‌గౌడ్ బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డికి మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఏ ఊళ్లోకి వెళ్లినా మాజీ మంత్రికి జనం నీరాజనం పలికారు. వారితో ఆయన అప్యాయంగా మాట్లాడి వారి కష్టసుఖాలను తెలుసుకున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి వారు ఎదుర్కొంటున్న బాధలను వెల్లడించారు. పదేండ్లలో కేసీఆర్ ప్రభుత్వం చేసిన మంచి పనులను గుర్తు చేసుకున్నారు. మళ్లా కేసీఆర్ సారే వస్తాడని, బీఆర్‌ఎస్‌కే ఓటేస్తామని పలువురు ప్రకటించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ రేవంత్ ప్రభుత్వం అధికారం చేపట్టి ఐదు నెలలవుతున్నా రుణమాఫీ మాటే ఎత్తడం లేదని ధ్వజమెత్తారు. రైతులను మోసం చేసే ప్రయత్నం చేస్తున్నదని విమర్శించారు. ఇప్పటికే పంటపెట్టుబడి సాయం డబ్బులు అందక ఎందరో కర్షకులు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రైతుల బాగోగులను పట్టించుకోవడం లేదన్నారు. కల్యాణలక్ష్మి పథకంలో భాగంగా రూ.లక్ష సాయంతోపాటు తులం బంగారం ఏమైందని నిలదీశారు. వృద్ధులు, వితంతులకు రూ.4 వేల పింఛన్ ఇస్తానని చెప్పి కేసీఆర్ ప్రభుత్వంలో అందించిన సాయాన్నే ఇస్తున్నారన్నారు. బీఆర్‌ఎస్ హయాంలో కరెంట్ కోతలు ఉండేవి కావని, కానీ నేడు పవర్ కట్‌తో జనం ఇక్కట్లు పడుతున్నారని చెప్పారు. ఓ వైపు వ్యవసాయానికి కరెంట్ సరఫరా లేక.. మరోవైపు బోర్లు, కాల్వలు వట్టిబోవడంతో సాగునీటికి రైతులు కష్టాలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పల్లెలు, పలు పట్టణాల్లో దాహందాహం మొదలైందన్నారు. దూరంగా ఉన్న వ్యవసాయ బోర్ల వద్దకు వెళ్లి నీటిని తెచ్చుకునే దుస్థితి ఏర్పడిందన్నారు. కేసీఆర్ ప్రభుత్వం మిషన్ భగీరథ పథకంలో భాగంగా నల్లాల ద్వారా ఇంటి వద్దకే శుద్ధమైన నీటిని అందించినట్లు గుర్తు చేశారు. ఇక బీజేపీ ప్రభుత్వం మతాల మధ్య చిచ్చుపెడుతూ.. ఆలయాల పేరుతో ఓట్లను దండుకోవాలని చూస్తున్నదని ధ్వజమెత్తారు. కేంద్రంలోని మోదీ సర్కారుతో తెలంగాణకు ఎలాంటి ప్రయోజనం చేకూరలేదన్నారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలను ప్రజలు నమ్మొద్దని సూచించారు. గ్రామాల్లోకి ప్రచారానికి వచ్చే ఈ రెండు పార్టీల నాయకులను ఏం చేశారో చెప్పాలని నిలదీయాలని సూచించారు. పేదల సంక్షేమ, అభివృద్ధి గురించి నిత్యం పరితపించిన బీఆర్‌ఎస్‌కు అండగా నిలబడాలన్నారు. సిట్టింగ్ ఎంపీ, బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించి మరోసారి పార్లమెంట్‌కు పంపించాలని కోరారు. ఈ ప్రాంతంలోని అభివృద్ధి, సమస్యలపై గళం విప్పే నాయకుడిని ఎన్నుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గ్రంథాలయాల సంస్థ మాజీ చైర్మన్ రాజేశ్వర్‌గౌడ్, ఎంపీపీ సుధాశ్రీ, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు దేవేందర్‌రెడ్డి, జెడ్పీ, మండల కోఆప్షన్ సభ్యులు అల్లాఉద్దీన్, మస్తాన్, నాయకులు రవీందర్‌రెడ్డి, ఆంజనేయులు, రాఘవేందర్‌గౌడ్, మల్లు నర్సింహారెడ్డి, దేవేందర్‌రెడ్డి, శ్రీకాంత్‌గౌడ్, రాంచంద్రయ్య, రాణెమ్మ, రమ్య, శ్రీను, శ్రీనివాసులు, చిన్నయ్యగౌడ్, మొగులప్ప, కార్యకర్తలు, నాయకులు ఉన్నారు.



ధర్మాపూర్‌లో వృద్ధులతో మాట్లాడుతున్న శ్రీనివాస్‌గౌడ్

# సర్కారును బొందపెడుదాం

- ఆరు గ్యారెంటీలతో ఆగం
- మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి



మాట్లాడుతున్నమా జీ మంత్రి నిరంజన్‌రెడ్డి, సమావేశానికి హాజరైన మహిళలు, బీఆర్‌ఎస్ శ్రేణులు

గోపాల్‌పేట, మే 9 : హామీలను విస్మరించిన సర్కారును బొంద పెట్టి, కేసీఆర్‌కు అండగా నిలవాలని.. వ్యవసాయానికి కేసీఆర్ సర్కారు అధిక ప్రాధాన్యమిచ్చి రైతును రాజును చేసిందని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. గురువారం మండలకేంద్రంలోని పద్మావతి గార్డెన్స్‌లో ఉమ్మడి మండల బీఆర్‌ఎస్ శ్రేణులు, ప్రజలతో నిర్వహించిన పార్లమెంట్ ఎన్నికల సమావేశానికి నిరంజన్‌రెడ్డి హాజరై మాట్లాడారు. ఏదుల రిజర్వాయర్ నియోజకవర్గానికే తలమానికమని, లక్షా 25వేల ఎకరాలకు శాశ్వత సాగునీరు అందించిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. అడగకముందే ప్రజల అవసరాలు తీర్చిన నేత కేసీఆర్ అని కొనియాడారు. సాగుతో రైతులకు, ఉపాధి పరిశ్రమల ద్వారా 16లక్షల మందికి ఉద్యోగాలు, ఐటీ ద్వారా 6.30లక్షల మందికి మొత్తంగా.. 40లక్షల మందికి ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించింది బీఆర్‌ఎస్ ప్రభుత్వమేనన్నారు. ఆరు గ్యారెంటీలతో ప్రజల బతుకులను కాంగ్రెస్ సర్కారు ఆగం చేసిందన్నారు. ఆరోగ్యశ్రీ రూ.10 లక్షలు, రైతుబంధు రూ.15వేలు, రుణమాఫీ రూ. 2లక్షలు, ఆసరా పింఛన్లు రూ.4వేలు, ప్రతి మహిళకు రూ. 2,500, ఉచిత కరెంట్, గ్యాస్ సబ్సిడీ, కల్యాణలక్ష్మీతో పాటు తులం బంగారం, యువతులకు స్కూటీలు, యువకులకు ఉద్యోగావకాశాలు, నిరుద్యోగ భృతి.. ఇలా ఎన్నో మోసపు హామీలతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని విమర్శించారు. కేసీఆర్ మార్గదర్శకత్వంలో వెయ్యి గురుకులాలను స్థాపించి 10లక్షల మంది విద్యార్థులను శాస్త్రవేత్తలు, డాక్టర్లు, ఇంజినీర్లుగా విదేశాల్లో ఉద్యోగాలు కల్పించిన మేధావి ఆర్‌ఎస్పీ అని కొనియాడారు. కారు గుర్తుకు ఓటేసి అత్యంత ప్రతిభావంతుడైన ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను పార్లమెంట్ ఎన్నికల్లో గెలిపించాలని కోరారు. మల్లు రవి పైరవీలకు ప్రాధాన్యమిచ్చి తమ ఆస్తులు, అంతస్తులను సంపాదించుకున్నారే తప్పా ప్రజలను పట్టించుకోలేదన్నారు. రాములు కన్న తల్లిలాంటి పార్టీకి మోసం చేసి.. ఓట్ల కోసం వస్తున్నాడని వారికి తగిన బుద్ధి చెప్పాలన్నారు. సమావేశానికి భారీగా తరలొచ్చిన మహిళలు స్పందిస్తూ.. హామీలు అమలు చేసే దాకా కాంగ్రెస్‌కు ఓటేయమని.. కేసీఆర్‌కే అండగా ఉంటామన్నారు. అనంతరం పలు పార్టీల నాయకులు బీఆర్‌ఎస్‌లో చేరగా వారికి మాజీ మంత్రి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో ఎంపీపీ సంధ్య, వైస్ ఎంపీపీ చంద్రశేఖర్, పెద్దమందడి జెడ్పీటీసీ రఘుపతిరెడ్డి, కోఆప్షన్ సభ్యులు మతీన్, డీసీఎంఎస్ వైస్ చైర్మన్ హర్యానాయక్, రైతుబంధు సమితి మండలాధ్యక్షుడు తిరుపతియాదవ్, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు బాలరాజు, జెన్‌కో రిటైర్డ్ ఎస్‌ఈ తిరుపతిరెడ్డి, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.



### కిష్టాపూర్‌లో నీటి కటకట

ఆడబిడ్డలు బిందెలతో రోడ్డు మీదకు రావొద్దనే ఉద్దేశంతో తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ మిషన్ భగీరథ పథకాన్ని ప్రవేశపెట్టారు. ఇంటింటికీ నల్లా కనెక్షన్ ఇచ్చి శుద్ధజలాన్ని అందజేశారు. అలాంటిది కాంగ్రెస్ అధికారం చేపట్టాక మహిళలు బిందెలతో రోడ్డు మీదకు వచ్చే పరిస్థితి దాపురించింది. ధన్వాడ మండలం కిష్టాపూర్‌లోని ఎస్సీ కాలనీలో మూడు రోజులుగా తాగునీరు రావడం లేదని ప్రజలు పేర్కొన్నారు. కరెంట్ కష్టాలతోపాటు తాగునీటికి ఇబ్బందులు తలెత్తాయని వారు ఆందోళన వ్యక్తం చేశారు. గురువారం ఉదయం ప్రజలు బోరు వద్ద గుమిగూడి నీళ్లు పట్టుకుంటున్న దృశ్యాన్ని 'నమస్తే తెలంగాణ' క్లిక్ మనిపించింది.

- ధన్వాడ, మే 9

# ఆగమైన రైతాంగం

- కల్లబొల్లి మాటలు నమ్మొద్దు..
- మాజీ ఎమ్మెల్యే చిట్టెం

మక్తల్ టౌన్/కృష్ణ, మే 9 : కాంగ్రెస్ అధికారం చేపట్టిన ఐదు నెలల్లోనే రైతాంగం ఆగమైందని.. దొంగ హామీలిచ్చిన సర్కారుకు పార్లమెంట్ ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ పాలమూరు ఎంపీ అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డికి మద్దతుగా గురువారం మండలంలోని ముడుమాల్, చేగుంట, గుడెబల్లూరు గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల ప్రజలు చిట్టెం వద్దకు వచ్చి కాంగ్రెస్ పాలనలో ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. కాంగ్రెస్‌కు ఓటేసినందుకు తమకు తగిన బుద్ధి చెప్పారని గోడు వెళ్లబోసుకున్నారు. వారి మాటలు విన్న చిట్టెం మాట్లాడుతూ.. మన్నెను గెలిపిస్తే కాంగ్రెస్ పరిపాలనను ఎండగట్టేందుకు వీలుంటుందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే కరెంట్, నీటి కష్టాలొస్తాయని ముందే తెలుసునన్నారు. ముడుమాల్‌లో ఉపాధి పనులు చేస్తున్న కూలీల వద్దకు వెళ్లగా.. కాంగ్రెస్‌కు ఓటేసి మోసపోయాం.. ఈ ఎన్నికల్లో కారు గుర్తుకే మా ఓటంటూ.. సమాధానమిచ్చారు. కార్యక్రమంలో నాయకులు శివరాజ్‌పాటిల్, మోనేశ్, శివప్ప, శంకర్ నాయక్, కృష్ణ, చెన్నయ్యగౌడ్, సంతోష్, సురేశ్, శివప్ప, వెంకటేశ్, తిమ్మప్ప, అమ్రేశ్, అశోక్‌గౌడ్, వెంకటేశ్, బాలప్ప, రాఘవేంద్ర, హనుమంత్‌రెడ్డి, కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.



కారు గుర్తుకు ఓటేయాలని కోరుతున్న చిట్టెం